క్లుప్తంగా...

'స్వచ్ఛ్ మార్షల్ మార్చ్'

మేడ్చల్: ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ్ మహోత్సవ్‌లో భాగంగా మేడ్చల్‌లో మున్సిపల్ సిబ్బంది, మెప్మాలు స్వచ్ఛ్ మార్షల్ మార్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పరికరాలను ఉపయోగించవద్దని, ప్లాస్టిక్ సంచులకు బదులు జూట్ బ్యాగులను వినియోగించాలని ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికానర్సింహ్మారెడ్డి అన్నారు. ర్యాలీలో కమిషనర్ రాములు, మేనేజర్ శ్రీదేవి, ఎన్విరాన్మెంట్ ఏఈ జ్ఞానేశ్వర్‌రెడ్డి, రాధాబాయి, ప్రియాంక, దివ్య తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ పరిధిలోని సీఎంఆర్‌సెట్ కళాశాలలో ఏప్రిల్ 4వ తేదీ నుంచి నిర్వహిస్తున్న 'అజురా 2కే23' జాతీయ స్థాయి స్టూడెంట్స్ సింపోయిజం కార్యక్రమ పోస్టర్‌ను బుధవారం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దేవదాస్ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో డీన్ విజయకుమార్, కోటేశ్వర్, శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు నాయక్, వెంకటేశ్వర్లు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని మంత్రికి వినతి

మేడ్చల్: అత్వెల్లి 3వ వార్డులో ఇళ్ల మధ్య శ్మశాన వాటిక ఉండటంతో అంత్యక్రియల సమయంలో అందరూ ఇబ్బందులు పడుతున్నారని, ప్రత్యేకంగా శ్మశాన వాటిక ఏర్పాటు కోసం స్థలం కేటాయించాలని కౌన్సిలర్ దేవరాజు మంత్రి మల్లారెడ్డిని కోరారు. ఈ మేరకు మంత్రిని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం సమర్పించారు.

కాంగ్రెస్ నిరసన

మేడ్చల్: రాహుల్ గాంధీని లోక్‌సభ నుంచి అనర్హుడిగా ప్రకటించడంతో కాంగ్రెస్ చేపట్టిన నిరసనలో భాగంగా ఆ పార్టీ మేడ్చల్ నాయకులు బుధవారం నిరసన చేపట్టారు. మేడ్చల్‌లో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను జాతీయ రహదారిపై దహనం చేశారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి హరివర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పెన్షనర్ల ప్రయోజనాలు కాపాడాలి

సాక్షి,మేడ్చల్ జిల్లా: ఆల్ ఇండియా ఇన్సూరెన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎల్ఐసీ, జీఐసీ నుంచి రిటైర్డ్ అయిన పెన్షనర్ల ప్రయోజనాలను కాపాడాలని కోరుతూ ఏఐఐఈఏ ఆధ్వర్యంలో బుధవారం అబిడ్స్ ఎల్ఐసీ బ్రాంచ్ వద్ద భోజన విరామ సమయంలో ఉద్యోగులు, సిబ్బంది ఆందోళన చేపట్టారు. ఫ్యామిలీ పెన్షన్ 30 శాతంగా బీమా పెన్షనర్లకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఎల్ఐసీ బోర్డు ఆమోదించినట్లు ఫ్యామిలీ పెన్షన్‌లో మార్పులు చేయకపోవడంతో 3 ఏళ్లుగా కుటుంబ పింఛనర్లు నష్టపోయారన్నారు. ఇన్సూరెన్స్ రంగంలో రిటైర్డ్ అయిన వారికి పెన్షన్ అప్‌గ్రెడేషన్ సదుపాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ డివిజన్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.తిరుపతయ్య, అబిడ్స్ ఎల్ఐసీ బ్రాంచ్ యూనియన్ అధ్యక్షుడు కిష్టయ్య, వి.రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణం సందర్శన

మేడ్చల్‌రూరల్/శామీర్‌పేట్: మూడుచింతలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని తెలంగాణ క్రీడా ప్రాంగణాన్ని బుధవారం తమిళనాడు రాష్ట్ర స్పోర్ట్స్ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ సెక్రెటరీ, ఐఏఎస్ మేఘనాథ్‌రెడ్డి సందర్శించారు. రాష్ట్రంలో చేపట్టిన క్రీడా ప్రాంగణాల నిర్మాణ తీరును పరిశీలించిన ఆయన నిర్మాణ వ్యయం, పనితీరు, విస్తీర్ణం, ప్రభుత్వం అమలు చేస్తున్న ఇతర పథకాల వివరాలను డీఆర్‌డీఏ పీడీ పద్మజారాణి, జిల్లా అభివృద్ధి అధికారితో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రవి, ఎంపీడీఓ వత్సలాదేవి, ఎంపీఓ రవి, గ్రామ కార్యదర్శి రాజేశ్వర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య యోజన కార్డును సద్వినియోగం చేసుకోండి

● బీజేపీ రాష్ట్ర నేత కొంపెల్లి మోహన్‌రెడ్డి

సాక్షి,మేడ్చల్ జిల్లా: కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య యోజన కార్డు నమోదు కార్యక్రమాన్ని పేదలు వినియోగించుకుని కార్పొరేట్ వైద్యాన్ని పొందాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు కొంపల్లి మోహన్ రెడ్డి తెలిపారు. బుధవారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ 9వ వార్డులో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి సంపత్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య యోజన కార్డు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. దమ్మాయిగూడలో 1500 మంది నిరుపేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో దమ్మాయిగూడ బీజేపీ అధ్యక్షుడు మోర నాగమల్లారెడ్డి, రవీందర్ గౌడ్, బుచ్చిరెడ్డి, సుజాత నాయక్, పద్మావతి, వరగంటి శోభ, తోట నరేష్ పటేల్, పరమేష్ గౌడ్, బీబీసీ రాజు, మల్లేష్, శేఖర్, నాయక్, శ్రావణ్, మధుసూదన్, ఆంజనేయులు, శ్రీనివాస్, మీ–సేవ నిర్వాహకులు నరసింహగౌడ్ పాల్గొన్నారు.



ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు

మొండికేశాయ్..

● ఆస్తి పన్నుల వసూలులో ప్రజలైతే ఓ లెక్క.. ప్రభుత్వాఫీసులైతే మరో లెక్క

● ప్రతి ఏటా పన్నులు చెల్లించలేకపోతున్న ప్రభుత్వ కార్యాలయాలు

● రూ.లక్షల్లో పేరుకుపోయిన ప్రాపర్టీ ట్యాక్సులు



అత్యధికంగా బకాయి ఉన్న తహసీల్దార్ కార్యాలయం

మేడ్చల్: పన్నులను చెల్లించండి పట్టణ అభివృద్ధికి సహకరించండి.. పన్నులు బకాయిలు ఉంటే పెనాల్టీలు వేస్తాం.. మొండికేస్తే రెడ్ నోటీసులు జారీ చేస్తామని నిత్యం ప్రజలను పట్టిపీడించి పన్నులు వసూలు చేసే మున్సిపల్ అధికారులకు తోటి ప్రభుత్వ అధికారులు మాత్రం పన్నులు కట్టకుండా చుక్కలు చూపిస్తున్నారు. మేడ్చల్ మండల కేంద్రం కావడంతో మండల కార్యాలయాలన్ని మేడ్చల్‌లోనే ఉన్నాయి. ప్రతీ శాఖ కార్యాలయం మేడ్చల్ కేంద్రంగానే పని చేస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, బస్ డిపో వంటివి కూడా మేడ్చల్‌లో ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలో ఉండటంతో ఆయా కార్యాలయాల భవనాలకు సంబంధించి మున్సిపల్ పన్నులు చట్ట ప్రకారం విధిగా ప్రతీ సంవత్సరం చెల్లించాలి. అధికారులు మాత్రం తమ భవనాల ప్రాపర్టీ ట్యాక్స్‌ను మాత్రం ప్రతీ ఏటా కట్టకపోవడంతో బకాయిలు ఒక్కో కార్యాలయం నుంచి లక్షల రూపాయల్లో పేరుకుపోతున్నాయి. కాగా మున్సిపల్ శాఖ లక్ష్యం పెట్టి వందశాతం వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేస్తుండగా ప్రభుత్వ ఆధీనంలో ఉండే భవనాలకు మాత్రం పన్నులు చెల్లించకపోవడంతో స్థానిక సిబ్బంది వంద శాతం పన్నులు వసూలు చేయలేక.. లక్ష్యాన్ని చేరలేక అవస్థలు పడుతూ పై అధికారులతో నానా చీవాట్లు పడుతున్నారు.

బకాయిలు చెల్లించాల్సిన కార్యాలయాలు

కార్యాలయం	బకాయి
తహసీల్దార్	రూ.34,85,702
ఎంపీడీఓ, వారి ఆధీనంలోని కార్యాలయాలు	రూ.11,76,692
పోలీస్ క్వార్టర్స్	రూ.23,920
పోలీస్‌స్టేషన్	రూ.62,190
అత్వెల్లిలోని విద్యుత్ సబ్‌స్టేషన్	రూ.2,08,478
మేడ్చల్‌లోని న్యాయస్థానాలు	రూ.5,28,000
బస్టాండ్	రూ.2,21,742
రహదారి బంగ్లా	రూ.28,997
మొత్తం	రూ.56,86,721


బకాయి ఉన్న జిల్లా పరిషత్ కార్యాలయం

వారు కట్టరు.. వీరు వసూలు చేయరు..

ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే అధికారులకు ప్రభుత్వ పరంగా ఎన్నో అధికారాలు, అన్ని రకాల సదుపాయాలు ఉంటాయి. వారు మాత్రం తమ అధికారాలను, విధులను ఉపయోగించకుండా పని చేస్తున్నారు. వారికి రూపాయి బకాయి ఉన్నా అధికారులు ముక్కు పిండి వసూలు చేయడం సహజంగా కనిపించే దృశ్యాలు. మున్సిపల్ అధికారులు పన్ను బకాయిలుంటే రెడ్ నోటీసులు జారీ చేయడం, ఇళ్ల ముందు నిరసన చేయడం, నల్లా, కరెంట్, డ్రైనేజీ కట్ చేయడం వంటివి చేస్తారు. లక్షల రూపాయల్లో ప్రభుత్వ కార్యాలయాలు బకాయిలు ఉన్నా వాటి వసూలుకు కేవలం నోటీసులు ఇచ్చి వారు చెల్లిస్తే తీసుకోవడం లేకపోతే పెండింగ్‌లో పెడుతున్నారు. తమ శాఖలకు రావాల్సింది ఉంటే వసూలు చేసే అధికారులు తమ కార్యాలయాల పన్నులు చెల్లించడంలో మాత్రం ఆసక్తి చూపడం లేదు.

లక్షల్లో బకాయిలు..

మేడ్చల్ కేంద్రంగా ఉన్న ఎంపీడీఓ, తహసీల్దార్, పోలీస్ క్వార్టర్స్, పోలీస్‌స్టేషన్, న్యాయ స్థానాలు, సబ్‌స్టేషన్, ఐటీఐ, బస్టాండ్ల నుంచి ఏటా పన్నులు రావాల్సి ఉన్నా అవిరాకపోవడంతో లక్షల రూపాయల్లో పన్నులు మున్సిపాలిటీకి బకాయిలు ఉన్నాయి.

రైతు బాంధవుడు సీఎం కేసీఆర్

● రైతుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి చామకూర మల్లారెడ్డి

● ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, సురభి వాణీదేవి, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డితో కలసి వ్యవసాయ సహకార సంఘం, గోదాంను ప్రారంభించిన మంత్రి



వ్యవసాయ సహకార సంఘం భవనాన్ని ప్రారంభించిన మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీలు రాజు, వాణీదేవి

మేడ్చల్‌రూరల్/శామీర్‌పేట్: రాష్ట్రంలోని రైతులకు సాగు, తాగు నీటితో పాటు ఉచిత కరెంట్, రాయితీలు వంటి ఎన్నో కార్యక్రమాలతో రైతులను అన్ని విధాల ఆదుకున్న రైతు బాంధవుడు సీఎం కేసీఆర్ అని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శామీర్‌పేట్‌లో నూతన వ్యవసాయ సేవా సహకార సంఘం భవనం, గోదాములను బుధవారం ఎమ్మెల్సీ, జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్ రాజు, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డిలతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశం, రైతుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మంత్రి మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టి వారి ఆర్థిక ఎదుగుదలకు బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైతులను రాజులుగా మార్చాలన్న సంకల్పంతో సీఎం కేసీఆర్ నిత్యం రైతుల కోసం పరితపిస్తున్నాడన్నారు. నష్టాల్లో ఉన్న శామీర్‌పేట్ సొసైటీని లాభాల బాటలో తీసుకురావడంలో సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి కృషి అభినందనీయం అన్నారు. అనంతరం మంత్రి రైతులతో కలిసి మంత్రి భోజనం చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లుబాయి, జెడ్పీటీసీ అనిత, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

'మా వార్డులపై చిన్నచూపు చూస్తున్నారు'


ఆవేదన వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్లు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బాసిరేగడి, జ్ఞానాపూర్ గ్రామాలపై (7,8 వార్డులపై) మున్సిపల్ అధికారులు, చైర్మన్‌లు చిన్న చూపు చూస్తున్నారని కౌన్సిలర్లు రాజకుమారి, ఆంథోనమ్మలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మున్సిపల్ బడ్జెట్ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ గుండ్లపోచంపల్లిలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నారే తప్పా.. తమ వార్డుల్లో మాత్రం అభివృద్ధి పనులు చేపట్టడం లేదన్నారు. తాము మున్సిపల్ పరిధిలోనే ఉన్నా పక్క గ్రామాలు అన్నట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, అభివృద్ధి పనులు చేపట్టాలని పలుమార్లు కమిషనర్, చైర్మన్ దృష్టికి తీసుకెళ్లినా పట్టింపు లేదన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ చైర్మన్, కమిషనర్ స్పందించి తమ వార్డుల్లో సమస్యలు పరిష్కరించి అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు.

వాగ్దానాలు అమలు చేయకుండా కాలం వెల్లదీస్తున్నారు


ప్రగతిశీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

జవహర్‌నగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు ఎన్నికల ముందు వాగ్దానాలను ఇచ్చి అధికారంలోకి వచ్చాక మాట మారుస్తూ కాలం వెల్లదీస్తున్నాయని ప్రగతిశీల మహిళ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు డి.స్వరూప అన్నారు. ప్రగతిశీల మహిళ సంఘం, పీఓడబ్ల్యూ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జవహర్‌నగర్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలో రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర ప్రస్తుతం రూ.1200 పెంచడం దారుణమని, రేషన్ షాపుల ద్వారా 12 రకాల సరుకులను ఉచితంగా అందచేయాలన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్–రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షురాలు బి.లక్ష్మీబాయి, నగర ఉపాధ్యక్షురాలు ఉయ్యాల ఉమా, ప్రగతినగర్ మహిళ సంఘం కార్యదర్శి జమ్మ, కనకమ్మ, రాజేశ్వరి, గంగమ్మ, నర్మద, మనమ్మ తదితరులు పాల్గొన్నారు.

సానుభూతి కాదు సహకారం అందిద్దాం

జవహర్‌నగర్: దివ్యాంగులపై సానుభూతి కాకుండా సహకారం అందించాలని బీఆర్ఎస్ జవహర్‌నగర్ ఉపాధ్యక్షురాలు మౌనిక రెడ్డి అన్నారు. జవహర్‌నగర్‌లోని వికలాంగుల కాలనీలో ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న దివ్యాంగ కుటుంబానికి బుధవారం నిత్యావసర సరుకులను ఆమె అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌డీఎఫ్ ఫౌండేషన్ సెక్రెటరీ సవితగౌడ్, మౌనికయాదవ్, మేరి తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగులకు నిత్యావసరాలు అందజేస్తున్న మౌనిక రెడ్డి

బీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర కార్యదర్శిగా ప్రదీప్‌సింగ్


నియామక పత్రం అందుకుంటున్న ప్రదీప్‌సింగ్

మేడ్చల్: భారత్ రాష్ట్ర ట్రేడ్ యూనియన్ (బీఆర్ఎస్ కేవీ)రాష్ట్ర కార్యదర్శిగా గుండ్లపోచంపల్లికి చెందిన ప్రదీప్‌సింగ్ నియమితులయ్యాడు. యూనియన్ అధ్యక్షుడు రాంబాబు ప్రదీప్‌సింగ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసి అతడికి నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బీఆర్ఎస్‌కేవీ అధ్యక్షుడు ప్రభాకర్ నాయకులు పాల్గొన్నారు.

దమ్మాయిగూడ కౌన్సిల్ సమావేశం బహిష్కరణ

కీసర: దమ్మాయిగూడ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్ మున్సిపాలిటీ పరిధిలోని 13, 14, 15 వార్డుల్లోనే అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ మిగితా వార్డులను విస్మరిస్తోందని పేర్కొంటూ బుధవారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని 14 మంది కౌన్సిలర్లు బహిష్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్ అధ్యక్షతన బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశం ప్రారంభం కాగానే వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 14 మంది కౌన్సిలర్లు మున్సిపల్ సమావేశ మందిరంలోకి వెళ్లకుండా కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ వార్డుల్లో ఎన్నో సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు నిధులు కేటాయించమని విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయంలో మంత్రి మల్లారెడ్డి స్పందించేంత వరకు తమ నిరసన వ్యక్తం చేస్తూనే ఉంటామన్నారు. అదేవిధంగా గ్రీన్ బడ్జెట్‌లో పెద్ద ఎత్తున అవినీతి నెలకొంటుందని, ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టాలన్నారు. కౌన్సిలర్లు అనురాధ, సరిత, స్వప్న, హేమలత, సురేఖ, సుజాత, వెంకటేష్, మంగళపురి వెంకటేష్, శ్రీహరిగౌడ్ తదితరులు నిరసన తెలిపిన వారిలో పాల్గొన్నారు. కోరం లేని కారణంగా సమావేశం వాయిదా పడింది.

ముగిసిన ఎన్ఎస్ఎస్ వేసవి శిబిరం

ఘట్‌కేసర్: అవుషాపూర్‌లో అనురాగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వేసవి ప్రత్యేక శిబిరం బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల డీన్ విజయ్‌కుమార్ విచ్చేసి మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ శిబిరం సమాజం గురించి నేర్పుతుందన్నారు. ప్రత్యేక అతిథి ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఏయూ అడ్మిషన్స్ డైరెక్టర్ ఎం.శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మల్లేశం మాట్లాడుతూ... ఎన్ఎస్ఎస్‌తో వలంటీర్లకు క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చెందుతుందన్నారు. సర్పంచ్ కావేరి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు నవీన్, కిరణ్, సీనియర్ వలంటీర్లు అఖిల, దరణి, సింధు, అభిషేక్, విష్ణు, సాయితేజ, మహేందర్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సర్పంచ్ కావేరి

పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ సూచనలు, నిబంధనలకు అనుగుణంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. బుధవారం కలెక్టరేట్ నుంచి జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారితో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సబితా ఇంద్రారెడ్డితో మాట్లాడారు. జిల్లా నుంచి పదో తరగతి పరీక్షలను ఏప్రిల్ 3 నుంచి 13 వరకు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం, విద్యుత్, ఫ్యాన్లు, వెలుతురు వచ్చేలా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక సదుపాయాలు కల్పించినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 44,014 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాయనుండగా 220 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, ఏసీపీ నరేష్‌రెడ్డి, డీటీఓ నరసింహ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



రూ.19 కోట్లతో గుండ్లపోచంపల్లి మున్సిపల్ బడ్జెట్


సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపల్ బడ్జెట్ సమావేశం బుధవారం మున్సిపల్ చైర్మన్ మద్దుల లక్ష్మిశ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో 2023–23 సంవత్సరానికి గాను రూ.19 కోట్ల అంచన వ్యయంతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రాములు, వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్ కార్పొరేషన్ బడ్జెట్ రూ.5.60 కోట్లు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని మేయర్ మేకల కావ్య అన్నారు. కార్పొరేషన్‌లో మేయర్ కావ్య అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అంచనా బడ్జెట్ రూ.5.60కోట్లు ప్రవేశపెట్టగా కార్పొరేటర్లు ఆమోదించారు. కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, ఆర్ఓ ప్రభాకర్‌యాదవ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బడ్జెట్ సమావేశంలో మేయర్, డిప్యూటీ మేయర్

మహనీయుల ఉత్సవ కమిటీ ఏర్పాటు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ మహనీయుల ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా మండల సురేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని చంద్రపురి కాలనీలో గల అంబేద్కర్ (బాబన్న) కమ్యూనిటీ హాల్‌లో దళిత బహుజన కులాలతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాదాపు 60కి పైగా కులాలతో చర్చించి మొట్టమొదటిసారిగా అన్ని కులాలతో కలిసి మహనీయుల జయంతి, వర్ధంతి ఉత్సవాలను నిర్వహించాలని నిర్ణయించారు. అనంతరం నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా మండల సురేందర్, సలహాదారులుగా కారింగుల శంకర్‌గౌడ్, కల్లెపల్లి సదానంద్, కుతాడి శ్రీనివాస్, మేకల అయ్యప్ప, సత్యం వంశరాజ్, తూరుగొండ రామన్నమాదిగ, ఆలూరి రాజశేఖర్, శివబాబు, షేక్ షావలి, ప్రవీణ్, పానుగంటి బాబు, ప్రధానకార్యదర్శిగా మొగిలిపాక పరశురాం, ఉపాధ్యక్షులుగా దామాల ప్రభాకర్‌రావు, బీర్రు యాకస్వామి, కన్నయ రాజు, వేణు మేరు, కొయ్యడ వెంకటేష్, బెల్లం అయిలయ్య, కారింగుల రాజుగౌడ్, ఎండి పాషామియా, పోచయ్య పద్మశాలి, చాగంటి వెంకటేష్, రమేష్‌చారి, కుతాడి రవీందర్, కుతాడి మహేష్, కృష్ణ, బోడ రవీందర్‌నాయక్, కోశాధికారిగా ఎర్రగుడ్ల వెంకటేశ్వర్, కార్యదర్శులుగా అల్లూరి సావిత్రిముదిరాజ్, పాకాల డానియేల్, మాట్ల వినయ్‌కుమార్, యాదగిరియాదవ్, శివ, మేడ స్వామి, ఎండీ మతిన్, బిరు ఎల్లస్వామి, గండి శ్రీనివాస్, రాములు, సింగన్న బాలరాజ్, మరోజు రమేష్‌చారి, బద్రయ్య, పుణ్యవతి, సహాయ కార్యదర్శులుగా చంద్రశేఖర్, సాయికుమార్, బిక్షపతి రజక, వనజాక్షి, శంకర్ శాలివాహన, వెంకటాద్రి, మీడియా ప్రతినిధులుగా కొన్నె వేణు, జంగిడి శ్రీనివాస్, అహ్మద్ పాషా, నర్ర మహేష్, అధికార ప్రతినిధులుగా తూటి శ్రీనివాస్, బొల్ల పద్మారావు, కుతాడి ముఖేష్, మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్, ఆనంద్ ఫాస్టర్, నాగరాజు, కాయిత రాజుయాదవ్, మారోజు సోమాచారిలతో పాటు మరో 50 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.


సమావేశంలో అభివాదం తెలుపుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కుల సంఘాల నాయకులు

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

ఘట్‌కేసర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని చైర్‌పర్సన్ పావనీయాదవ్ అన్నారు. మున్సిపాలిటీలోని 16వ వార్డులో వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కమిషనర్ వేమనరెడ్డితో కలిసి బుధవారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రవీందర్, డాక్టర్ శ్రేయ, పీహెచ్ఎన్ విమలరెడ్డి, ఆప్తమాలజిస్ట్ శిరీష, డీఈఓ సాత్విక్, విజయ, రాజేశ్వరీ, ధనలక్ష్మీ, మేఘమాల, విజయ్, జశ్వంత్ పాల్గొన్నారు.

దమ్మాయిగూడలో...

కీసర: కళ్ల సమస్యలను పరిష్కరించేందుకు గ్రామంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణితాగౌడ్ అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని 9వ వార్డు భవానీనగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కమిషనర్ స్వామి, కౌన్సిలర్ సరితావెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలపై అవగాహన

కీసర: పోషణ పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం నాగారం మున్సిపల్ పరిధిలోని జెడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో విద్యార్థులకు చిరు ధాన్యాలపై అవగాహన కల్పించి పోషకాహార ప్రదర్శన నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థినులకు హిమోగ్లోబిన్ టెస్టులు చేశారు. మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, వైద్యాధికారి డాక్టర్ సరితారెడ్డి, కౌన్సిలర్ మోకు రేణుకజగన్మోహన్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ మహోత్సవ్ ర్యాలీ

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో విజ్ఞాన్ మహిళా కళాశాల, ఆర్పీ మహిళల ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛ మహోత్సవ్‌పై ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కమిషనర్ వేమనరెడ్డి హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వచ్ఛతపై చైర్‌పర్సన్ విద్యార్థుచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, రవీందర్, మేనేజర్ అంజిరెడ్డి, జంగయ్యయాదవ్, మాజీ వార్డు సభ్యుడు దేవేందర్‌ముదిరాజ్, నర్సింగ్‌రావు, విజ్ఞాన కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ బడ్జెట్ సమావేశం

మేడ్చల్‌రూరల్/శామీర్‌పేట్: తూంకుంట మున్సిపల్ బడ్జెట్ సమావేశం మున్సిపల్ వైస్ చైర్మన్ పన్నాల వాణి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో 2023–24 ఏడాదికి గాను బడ్జెట్ ప్రవేశ పెట్టగా కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ ఏడాది రూ.1626.40 లక్షల ఆదాయం వస్తోందని, రూ.1297.35 లక్షల వ్యయం అవుతుందని అంచనా వేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జైత్‌రాం, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల అందజేత

ఘట్‌కేసర్: ప్రతాపసింగారం పదో తరగతి విద్యార్థులకు వైఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, జామెట్రీ బాక్స్‌లను బుధవారం ముఖ్యఅతిథిగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి విచ్చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం పాపిరెడ్డి, బస్వరాజ్, సాయిలు, స్వప్న, సంధ్యారాణి, హెచ్ఎం రవి, రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అత్వెల్లిలో...

మేడ్చల్: పరీక్షలు రాయబోతున్న అత్వెల్లి విద్యార్థులకు బీజేపీ నాయకుడు జాకట ప్రేమ్‌దాస్ పరీక్ష సామగ్రిని అందజేశారు. అత్వెల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవసరమయ్యే ప్యాడ్లు, పెన్నులు ఇతర సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఈశ్వర్, వంశీ వంజరి, సీఎం రాజు, ఉపాధ్యాయులు రామారావు, రాజిరెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అవుషాపూర్‌లో...

ఘట్‌కేసర్: అవుషాపూర్‌లో పదో తరగతి విద్యార్థులకు సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డి బుధవారం పరీక్ష ప్యాడ్లు, జామెట్రీ బాక్సలు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో మశ్చేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మేడ్చల్‌రూరల్/శామీర్‌పేట్: గుర్తుతెలియని వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని లాల్‌గడిమలక్‌పేట్ గ్రామంలోని మల్కచెరువు వద్ద మర్రిచెట్టుకు వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదని, సుమారు 50–55 ఏళ్ల మధ్య వయస్సు ఉంటాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.